క్లుప్తంగా

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా గుణిశెట్టి



గుణిశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తున్న బెహరా భాస్కరరావు తదితరులు

గోపాలపట్నం: ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గుణిశెట్టి శ్రీనివాసరావును జీవీఎంసీ కోఆప్షన్‌సభ్యుడు బెహరా భాస్కరరావు అభినందించారు. గోపాలపట్నంలో భాస్కరరావును శనివారం గుణిశెట్టి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుణిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని నమ్ముకున్న వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ..అందుకు తానే ఉదాహరణ అని అన్నారు. బెహరా భాస్కరరావు మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి తగిన ప్రాధాన్యం కల్పించిన పార్టీ వైఎస్సార్ సీపీ అని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ అడ్డగళ్ల వీవీగుప్త, మాజీ జిల్లా గవర్నర్ మద్ది జగన్ మోహన్, బి. శ్రీనివాసరావు, మధుబాబు, గరుడ కృష్ణ, బి. శ్యామలరావు, వి. ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సాంబో బాక్సింగ్ పోటీలకు విశాఖ క్రీడాకారిణులు



హేమలతారెడ్డి, అంజలితో చీఫ్ కోచ్ రుక్మాకరరావు

గోపాలపట్నం: జాతీయ స్థాయి సాంబో బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు స్థానిక క్రీడాకారిణులు ఎంపికయ్యారని చీఫ్ కోచ్ డాక్టర్ పాండ్రంకి రుక్మాకరరావు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు హర్యానాలో జరగనున్న ఈ పోటీల్లో బుల్లయ్య కళాశాలలో బీ.కాం సెకండియర్ చదువుతున్న వై.హేమలతారెడ్డి, ఎన్ఆర్ఐ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న యనమరెడ్డి అంజలి పాల్గొంటారని చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందితే అంతర్జాతీయ సాంబో బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికవుతారన్నారు. వీరి తరఫున ఏపీ టీమ్ మేనేజర్‌గా వై.కనకారెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హేమలతారెడ్డి, అంజలిని రుక్మాకరరావు తదితరులు అభినందించారు.

వేడుకగా వెంకన్న తీర్థం



కలియుగ వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు, అర్చకులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి పట్టిమ రాజు ఆధ్వర్యంలో శనివారం తీర్థ(పరస) మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలయ ప్రధాన అర్చకులు చామర్తి జగనాథశర్మ, శంకరశర్మ నేతృత్వంలో ఉదయం విశేష పూజలు, సుప్రభాత సేవ నిర్వహించారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరుడికి ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన, మంగళశాసనాలు, పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం పరసలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, పూజలు జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

సలాం వలంటీర్

- ప్రజలకు నిస్వార్థంగా ప్రభుత్వ సేవలు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగికి పింఛన్ అందిస్తున్న వలంటీర్



62వ వార్డులో దివ్యాంగుడికి పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్

సింధియా: రాష్ట్రంలో ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ప్రజల వద్దకు ప్రభుత్వ పాలనను చేరువ చేస్తూ వార్డు వలంటీర్లు తమ విలువైన సేవలు అందిస్తున్నారు. జీతం కోసం కాకుండా సేవాగుణంతో పనిచేస్తున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు, సంక్షేమ సారథులుగా వలంటీర్లు నిలిచారు. గతంలో జన్మభూమి కమిటీలు అరాచకాలతో పేదల సంక్షేమాన్ని రాబందుల్లా పీక్కుతింటే.. నేడు వాటి స్థానంలో పారదర్శకంగా తులసిమొక్కలాంటి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్ ఆలోచనకు అంతా సలాం చేస్తున్నారు. కుల, మత, వర్గాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అందిస్తూ బ్రాండ్ అంబాసిడర్లుగా నిలిచారు.

పారిశ్రామిక ప్రాంతంలో విలువైన సేవలు

పారిశ్రామిక ప్రాంతంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు అజరామరమని, వాటికి వెలకట్టలేమని ఎందరో కితాబిస్తున్నారు. కరోనా కష్టకాలంలో వారు చేసిన సేవలు ఎంతో విలువైనవని కొనియాడుతున్నారు. ఇటీవల ఓ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చూపారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఎందరో లబ్ధిదారుల వద్దకు వలంటీర్లు స్వయంగా వెళ్లి పింఛన్ నగదు అందజేసి తమ నిబద్ధతను చాటుకున్నారు.

జీవీఎంసీ 40, 62, 63 వార్డులకు చెందిన వలంటీర్లు సేవాస్ఫూర్తితో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజాము నుంచే వలంటీర్లు తమ విధులను ప్రారంభిస్తున్నారు. సూర్యోదయానికి ముందే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల పథకాలకు లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించి వారితో దరఖాస్తు చేయిస్తూ సంక్షేమ ఫలాలు పొందేలా చూస్తున్నారు. తద్వారా ప్రతి కుటుంబంలో ఒక సభ్యుడిలా మెలుగుతూ నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్నారు.

సేవాభావాన్ని చాటుకున్నారు



వలంటీర్లు విధి నిర్వహణలో తమలోని సేవాభావాన్ని చాటుకుంటున్నారు. 62వ వార్డులోని వలంటీర్లు ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో ఎంతో ఉత్సాహంగా ఉంటున్నారు. పెన్షనర్లకు ఇంటి వద్దే ప్రభుత్వ పింఛన్ అందించడంతోపాటు సంక్షేమ పథకాలకు అర్హుల చేత దరఖాస్తు చేయిస్తున్నారు.

– నక్కా సూర్యనారాయణ, 62వ వార్డు

ప్రజలకు సేవ చేస్తున్నా..



ప్రజలకు సేవ చేయాలనే తపనతోనే వలంటీర్ అయ్యాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకురావడంతో ఈ అవకాశం లభించింది. ప్రజలకు సంక్షేమ పథకాలను గడప వద్దే అందించాలనే ప్రభుత్వ ఉద్దేశం నచ్చి వలంటీర్‌గా చేరి తృప్తిగా సేవ చేస్తున్నాను.

– సురేష్, వలంటీర్, దుర్గానగర్ సచివాలయం, 62వ వార్డు

'పశ్చిమ'లో సంబరాలు

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆనంద్‌కుమార్‌ను ప్రకటించడంపై హర్షాతిరేకాలు



సంబరాల్లో పాల్గొన్న బెహరా భాస్కరరావు, పార్టీ శ్రేణులు

గోపాలపట్నం: విశాఖలో పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆడారి ఆనంద్ కుమార్ పేరు ప్రకటించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. పశ్చిమలో ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడిస్తామని స్పష్టం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఇంటి వద్ద కేక్ కత్తించి సంబరాలు చేశారు. నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ తీసుకురావడానికి కార్యకర్తలంతా బాధ్యగా భావించి మరింత రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలని కోరారు.

పార్టీ కార్యాలయం వద్ద..

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆనంద్‌కుమార్ పేరు ప్రకటించడంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆనందంలో మునిగి తేలారు. 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భీశెట్టి గణేష్, గుంట సుందరరావు,పుర్రె సురేష్,సత్యనారాయణ,ఖాన్,సంపత్ కుమార్,కోటా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ కమిటీల నియామకం

విశాఖ సిటీ: విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి నేతలకు జిల్లా పార్టీ అనుబంధ విభాగ కమిటీల్లో చోటు కల్పించారు. జిల్లా బీసీ సెల్ కమిటీ కార్యదర్శులుగా గుంటు రవికుమార్, చొల్లంగి వెంకటకిషోర్, సంయుక్త కార్యదర్శులుగా దేవాదుల శివనారాయణ, సింగవరపు సత్యనారాయణ, సర్వసిద్ధి పైడిరాజులను నియమించారు. అలాగే జిల్లా మహిళా విభాగం కమిటీ కార్యదర్శిగా డి.రాజేశ్వరి, సంయుక్త కార్యదర్శిగా ముల్లి లక్ష్మి నియమితులయ్యారు. జిల్లా ఎస్సీ సెల్ కమిటీ కార్యదర్శులుగా పెద్దాడ ప్రసాదరావు, పెద్దాడ అప్పలరాజు, సంయుక్త కార్యదర్శులుగా ఎల్.చిన్నారావు, జె.జీవన్ రావు, నరసింగమూర్తి, ఎల్.అప్పారావును నియమించారు. జిల్లా ఐటీ వింగ్ కార్యదర్శిగా జోగి శివాజీ, జిల్లా యూత్ వింగ్ కార్యదర్శిగా సి.హెచ్. వరుణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా భోగవల్లి నాని, నెల్లపు లోకేష్, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ కమిటీ కార్యదర్శిగా చరకపు బుజ్జి, సంయుక్త కార్యదర్శులుగా ఎల్లేటి వరప్రసాద్, వై.వెంకటఅప్పారావు(అశోక్), దంగేటి కుమారస్వామిని నియమించారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ప్రయాణించే రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. మిగిలిన రైళ్లు యథావిధిగా నడుస్తాయన్నారు.

వచ్చేనెల 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మచిలీపట్నం-విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 2వ తేదీ నుంచి 29వ తేదీ తేదీ వరకు విశాఖ-మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విశాఖ -గుంటూరు -విశాఖ (22701/22702) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

పలు రైళ్ల దారి మళ్లింపు...

ఈ క్రింది రైళ్లు ఆయా తేదీల్లో నిడదవోలు-ఏలూరు- విజయవాడ మీదుగా కాకుండా మళ్లించబడిన మార్గంలో వయా నిడదవోలు-భీమవరం టౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా ప్రయాణిస్తా యని రైల్వే అధికారులు తెలిపారు. వచ్చే నెల 1,8, 15,22వ తేదీల్లో ఎర్నాకుళం-పాట్నా (22643) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 3,5,10,12, 17,19,24, 26వ తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు-గౌహతి (12509) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 1,3,5,6,8,10, 12,13,15, 17,19,20,22,24, 26,27వ తేదీల్లో ముంబయి-భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 1వ తేదీ నుంచి 28తేదీ వరకు ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, 4,11,18,25వ తేదీల్లో టాటానగర్ - యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్, 3,10,17,24వ తేదీల్లో జసిద్ధి -తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, 1,8,15,22వ తేదీల్లో హతియా- ఎర్నాకుళం (22837) ఏసీ ఎక్స్‌ప్రెస్, 6,13,20,27వ తేదీల్లో హతియా- ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్, 2,7,9,14,16,21,23,28వ తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ , 5,12,19,26వ తేదీల్లో టాటానగర్ - ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



క్షయపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం - ఆర్పీపేట వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం 'క్షయ వ్యాధిని మనం అంతమొందించగలం' అనే నినాదంతో ర్యాలీలు నిర్వహించారు. డాక్టర్ మట్టా శశి ప్రియాంక ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధిని ప్రజలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాల చేపట్టిందన్నారు. ప్రధానమంత్రి టి.బి. ముక్త్ భారత్ అభియాన్ పేరిట అవగాహన చేపట్టిందని తెలిపారు. ఆర్పీపేట ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీబీ పీఆర్‌వో ఎస్.పైడిరాజు, అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి, కుమారి, ఆర్పీపేట పీఈటీ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సత్యపద్మ



సత్యపద్మకు స్వాగతం పలుకుతున్న కార్యాలయ ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎం.సత్యపద్మ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆమె ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఈడీ కార్యాలయం ఉద్యోగులు ఆహ్వానం పలికారు. అంతకుముందు సత్యపద్మ.. జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు



బహుమతి అందిస్తున్న డాక్టర్ జ్యోతిర్మయి

సీతంపేట: ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో జరిగిన ముగింపు సభలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ గ్లకోమాపై అవగాహన కల్పించడం వైద్య ఉద్యోగులుగా మనందరి బాధ్యతని పేర్కొన్నారు. వారం రోజులపాటు గ్లకోమా అవగాహన కార్యక్రమాలు ఎక్కడెక్కడ ఎలా జరిగాయో వివరించారు. ఈ సందర్భంగా జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులకు గ్లకోమా అవగాహన కోసం వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఆర్ఎంవో నవీన్‌కుమార్, వైద్యులు రమణ, వాణిశ్రీ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో చోరీల నియంత్రణ



దొండపర్తి వాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని దొండపర్తిలో శనివారం సీసీ కెమెరాలు, దొంగతనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు కాల్ చేసి సమాచారమందించాలని స్థానికులకు సూచించారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంచరదని, బ్యాంక్‌లో భద్రపరచడమే మేలన్నారు. ఊళ్లు వెళ్లేటప్పుడు ఇంటికి జాగ్రత్తగా తాళం వేయాలన్నారు. చోరీలు జరిగినప్పుడు పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను శనివారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, నాయకులు దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, ప్రకాశరావు, జి. గణేష్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మురళీనగర్: జోన్-2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్, ఏపీహెచ్‌బీ ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అక్కడ తొలగించారు.. ఇక్కడ వదిలేశారు



విమానాశ్రయం వద్ద భారీ ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది



శ్మశానవాటిక జంక్షన్ వద్ద తొలగించని టీడీపీ ఫ్లెక్సీ

గోపాలపట్నం: ఎన్నికల కోడ్ రావడంతో పబ్లిక్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను అధికారులు తొలగించారు. అయితే ఎయిర్ పోర్టు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు తొలగించిన అధికారులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోలతో ఏర్పాటు చేసిన తోరణాలు తొలగించలేదు. అలాగే గోపాలపట్నం శ్మశాన వాటిక జంక్షన్ వద్ద తెలుగుదేశం బ్యానర్‌ను వదిలేయడంపై స్థానికులు అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

రాజ్యాంగాన్ని మార్చే యోచనలో బీజేపీ



మాట్లాడుతున్న ఆచార్య కె.ఎస్.చలం

సీతంపేట: చట్టం ముందు అందరూ సమానమేనని రాజ్యాంగంలో ఉందని, దీనిని బీజేపీ ప్రభుత్వం మార్చాలని చూస్తోందని, అందుచేత మనుధర్మాన్ని తగులబెట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని యూపీఎస్సీ పూర్వ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో 'మనువాదం - దళితులు - రాజ్యాంగం'అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా అందరికీ సమాన హక్కులను కల్పించిన రాజ్యాంగం అమలు జరిగితేనే మనుగడ సాధించగలమన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి వేస్తుందని హెచ్చరించారు. బీజేపీ పాలకులు నేడు మనువాదాన్ని దేశంలో అమలు చేస్తున్నారని, దానికి ఉదాహరణ పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించక పోవడమేనన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజబాబు, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, సీపీఎం నాయకులు లోకనాథం , ఆర్పీఐ నాయకులు బి.కల్యాణరావు, శివప్రకాష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాదకద్రవ్యాల నిరోధంపై ప్రసంగిస్తున్న సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్

కూర్మన్నపాలెం: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు సర్వనాశనం అవుతాయని విశాఖ సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్ కుమార్ తెలిపారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. మాదకద్రవ్యాల నిరోధంపై సింహాద్రి టీఎంటీ ఆధ్వర్యంలో గ్రీన్‌సిటీ వైజాగ్ ప్రొఫైల్ ఆఫీస్ నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరదాగా మొదలైన ఈ అలవాటు చివరికి వాటికి బానిసలుగా మార్చేస్తుందన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి కుటుంబ విలువలు పెరిగేలా ప్రవర్తించాలని సూచించారు. సింహాద్రి టీఎంటీ అధినేత బండి సురేష్‌కుమార్, కోస్టల్ ఆంధ్ర బీసీ వెల్ఫేర్ అధ్యక్షుడు నరవ రాంబాబు, ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఎస్. శ్రీనివాస్, హెచ్.నర్స్ కె.మణి, పూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 204 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ శిబిరంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ శిబిరంలో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా న్యాయమూర్తులు 204 కేసులను పరిష్కరించారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు ప్రారంభించిన ఈ శిబిరంలో సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్, యాక్సిడెంట్, బీమా తదితర రూ.11.65 కోట్ల విలువైన కేసులను పరిష్కరించినట్టు కోర్టువర్గాలు తెలిపాయి. ఐదు బెంచీలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, వి.పల్లవి, వై.ప్రేమలత, బార్ అసోసియేషన్ ప్రతినిధులు వి.ఎం.కృష్ణ, ఎ.సీతా మహాలక్ష్మి పాల్గొన్నారు.

అప్‌గ్రేడెడ్ లోకోషెడ్‌లో డీఆర్ఎం తనిఖీలు



ఎలక్ట్రిక్ లోకోషెడ్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ మర్రిపాలెంలో ఆధునికీకరించిన ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో శనివారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. విశాఖపట్నం ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో అప్‌గ్రేడ్ చేసిన డబ్ల్యూఏజీ9 లోకోను ఆయన పరిశీలించారు. ఈ లోకోలో ప్రయాణం సుఖంగాను, లోకో పైలట్‌కు మరింత సౌకర్యవంతమైన డ్రైవింగ్ అనుభూతిని కల్పిస్తుందని సిబ్బంది తెలిపారు. అండర్ గేర్ నిర్వహణ డిపో, లేబొరేటరీ, షెడ్‌లో గల లోకోలను కూడా డీఆర్ఎం పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి వాటి వివరాలు తెలుసుకున్నారు.